క్లుప్తంగా

వైద్యమిత్రల శాంతియుత నిరసన



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న వైద్యమిత్రలు

పార్వతీపురంటౌన్: సమాన పనికి సమానవేతనం కల్పించాలని డాక్టర ఎన్టీఆర్ వైద్యమిత్రలు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద శాంతియుత నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వైద్యమిత్ర కమలాకర్ మాట్లాడుతూ గత 19 ఉళ్ల నుంచి చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రధానంగా జీవో నంబర్ 28 రద్దు, ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. తమను కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో వైద్యమిత్రలు పాల్గొన్నారు.

రెండు షాపులు దగ్ధం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

సాలూరు: పట్టణంలోని రాయల్ ఫుడ్ హోటల్ సమీపంలో జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు షాపులు దగ్ధమయ్యాయి. హోటల్ సమీపంలో ఉన్న స్క్రాప్ దుకాణం, మరో దుకాణం సోమవారం జరిగిన అగ్ని ప్రమాదంలో కాలిపోతున్న సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బందికి వచ్చి మంటలను అదుపుచేశారు.

తోటపల్లి పాత ఎడమ కాలువ ద్వారా నీరందించాలి

పార్వతీపురంటౌన్: తోటపల్లి పాత ఎడమ కాలువ ద్వారా నీరందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పలనాయుడు కోరారు. ఈ మేరకు సోమవారం డీఆర్ఓ హేమలతకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎ.పార్థసారథి, వైకుంఠరావు, విశ్వేశ్వర రావు, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతోనే ఏర్పాట్లు



బెంచీని మోసుకువెళ్తున్న విద్యార్థులు

పార్వతీపురం రూరల్: పదోతరగతి పరీక్షల నిర్వహణకు ముందస్తుగానే ఏర్పాట్లు చేయాల్సి ఉన్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పరీక్షరోజే హడావిడిగా విద్యార్థులతో పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లు చేయించారు. సోమవారం పదవ తరగతి పరీక్షలు మరికొద్ది నిమిషాల్లో ప్రారంభం కానున్న తరుణంలో మండలంలోని ఎమ్మార్‌నగరం పాఠశాలలో విద్యార్థులతో మొదటి అంతస్తులో ఉన్న బెంచీలను కిందికి తెప్పించి వరండాల్లో వేసి వాటిపై రిజిస్టర్ నంబర్లను నమోదు చేశారు. విద్యార్థులు బెంచీలను తెస్తున్న దృశ్యాలు అధికార సిబ్బంది నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలిచాయి.

ఆస్పత్రి అందుబాటులోకి వచ్చేదెప్పుడు..?

సీతంపేట: మండల కేంద్రంలో నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అందుబాటులోకి వచ్చేదెప్పుడని ఎంపీపీ బి.ఆదినారాయణతో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రశ్నించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సమావేశమై పలు సమస్యలపై చర్చించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ ఆస్పత్రి నిర్మాణానికి రూ.49 కోట్ల నిధులు మంజూరు చేశారన్నారు. అప్పట్లో పనులు చకచకా జరిగాయని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎటువంటి పనులు ముందుకు సాగడం లేదన్నారు. కాగా ఉపాధి హామీ పనుల్లో కూడా జాప్యం జరుగుతోందని ఆరోపించారు. నూతన నిర్మాణాల శంకుస్థాపనలకు అధికారులు ప్రొటోకాల్ ఉల్లంఘిస్తున్నారన్నారు. కొత్త పంచాయతీల భవన నిర్మాణాలకు నిధులు మంజూరైనా, ఇంతవరకు పనులు ప్రారంభించలేదన్నారు. గ్రామాల్లో నీటి ఎద్దడి నివారణా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఎస్.సుశీల, సిమ్మయ్య, ఎంపీటీసీ సభ్యులు ఎస్.మంగయ్య, గణేష్, జి.కోటేశ్వరరావు, పార్టీ నాయకులు ఎస్.రాము, ఎస్.సాయికుమార్, ఎస్.తవిటిరాజు, జగ్గారావు, తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళా రేపు

పాలకొండ రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్స్‌పాల్ డాక్టర్ ఎం.శ్యాంబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జవహర్ నాలెడ్జ్ సెంటర్, ప్లేస్‌మెంట్ సెల్ నేతృత్వంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 19 నుంచి 26 ఏళ్ల లోపు ఉండి పది, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లమో అర్హత గల యువతీయువకులు మేళాకు హాజరుకావాలన్నారు. విద్యార్హత ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్‌లు, బయోడేటా, రెండు ఫొటోలతో ఉదయం 9 గంటలకు హాజరుకావాలని కోరారు.

ఎలిఫెంట్ జోన్ మాకొద్దు

- జనావాసాల మధ్య ఏర్పాటుపై ప్రజాగ్రహం
- కలెక్టరేట్ వద్ద నిరసన



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న గ్రామస్తులు, సీపీఎం నాయకులు

పార్వతీపురంటౌన్:

పార్వతీపురం, సీతానగరం మండలాల్లో ఎలిఫెంట్‌జోన్ వద్దంటూ రెండు మండలాల గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఆవరణలో సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. అప్పయ్యపేట, రేపటివలస, జోగింపేట, గుచ్చిమి, అంటివలస, తాన్న సీతారాంపురం, చినరాయుడుపేట గ్రామ సరిహద్దుల్లో 1100 ఎకరాల కొండ సరిహద్దుల్లో ఎలిఫెంట్ జోన్‌ను ఏర్పాటు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. రైతులు, ప్రజలకు సమాచారం అందించకుండా, గ్రామ సభలు నిర్వహించకుండా పనులు ఏ విధంగా చేపట్టారని ప్రశ్నించారు. తక్షణమే ఎలిఫెంట్ జోన్ పనులు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. జిల్లా నడిబొడ్డున ఉన్న సీతానగరం, పార్వతీపురం మండలాల్లో ఏర్పాటు చేయడమంటే ప్రజల ప్రాణాలతో చెలగాటమేనని ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు తక్షణమే ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ఎక్కడి నుంచి వచ్చాయో అక్కడికే తరలించాలి

ఏనుగులు ఏ ప్రాంతం నుంచి వచ్చాయో అప్రాంతానికే వాటిని తరలించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ప్రాంతాల్లో ట్రెంచ్ కటింగ్‌లు తవ్వకాలు చేపట్టడం వల్ల గిరిజనులు, దళితులు, పేదలు గత 50ఏళ్ల నుంచి పెంచుకుంటున్న పంటలు నాశనమవుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరికి పోడుపట్టాలు, మరికొందరికి లీజు పట్టాలు ఉండి సాగుచేస్తూ జీవితం కొనసాగిస్తున్న వారి జీవితాలు ప్రశ్నార్థకంగా మారుతున్నాయని వాపోయారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి పనులను నిలిపివేసి రైతులకు భరోసా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రెడ్డి వేణు, రెడ్డి లక్ష్మునాయుడు, రెడ్డి రమణమూర్తి, రెడ్డి ఈశ్వరరావు, గవర వెంకటరమణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎలిఫెంట్ జోన్ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

పార్వతీపురం: సీతానగరం మండలం అప్పయ్యపేట, రేపటివలస, తామరఖండి, జోగింపేట, గుచ్చిమి, తాన్నసీతారాంపురం, చినరాయుడుపేట, పరిసరాల్లోని జనవాసాల మధ్య ఎలిఫెంట్ జోన్ ఏర్పాటు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి కొల్లు గంగునాయుడు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజా సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ సభ్యులు పట్టణంలోని సుందరయ్య భవనం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు, అక్కడి నుంచి జిల్లా అటవీశాఖ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం డీఎఫ్ఓకు వినతిపత్రం అందజేశారు. ర్యాలీలో రెడ్డి ఈశ్వరరావు, జీవీ రమణ, రెడ్డి వేణు, లక్ష్మునాయుడు తదితరులున్నారు.



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిర్వహించిన ర్యాలీ, ఆందోళనలో పాల్గొన్న ప్రజాసంఘాల నాయకులు

తక్షణమే పనులు నిలిపివేయాలి



ఏనుగుల సంరక్షణ కేంద్రం కింద చేపడుతున్న పనులు తక్షణమే నిలిపివేయాలి. జిల్లా కేంద్రానికి సమీపంలో ఎలిఫెంట్ జోన్ పెట్టడం సరైన విధానం కాదు. ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడతారు. అధికారులు ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి.

– జి. వెంకటి, గుచ్చిమి గ్రామం

జనావాసాల మధ్యలో సరికాదు



జనావాసాల మధ్యలో ఎలిఫెంట్ జోన్ ఏర్పాటు చేయడం సరైన విధానం కాదు. మేము సాగు చేసుకుంటున్న పొలాల సమీపంలో ఎలిఫెంట్ జోన్ ఏర్పాటు చేస్తున్నారు. ప్రజల ప్రాణాలతో అధికారులు చెలగాటం ఆడుతున్నారు. ఈ ఎలిఫెంట్ జోన్‌ను రద్దుచేయాలి.

– గుంపమ్మ, చిన్నారాయుడుపేట

అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేయండి



ఎలిఫెంట్ జోన్‌ను అటవీ ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలి. అంతే కానీ జనావాసాల మధ్యలో ఏర్పాటు చేయడంవల్ల అనేక గ్రామాల ప్రజలు ఇబ్బంది పడతారు. ఏనుగులకు అటవీప్రాంతాల్లో ప్రత్యేక జోన్ ఏర్పాటు చేసుకోండి. గ్రామాల సమీపంలో ఏర్పాటు చేస్తే ఉద్యమాలు తప్పవు.

– జి. చిన్నయ్య, తాన్న వలస గ్రామం

ఆవరించిన పొగమంచు

- ఉదయం 8గంటల వరకు కనిపించని రహదారులు



మంచుతో కమ్ముకున్న వంతరాం రహదారి

బలిజిపేట: మంచు ప్రభావం ఇంకా వదలడం లేదు. సోమవారం ఉదయం 8గంటలు దాటినా మంచు ప్రభావం ఉండడంతో రాకపోకలకు వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం 8గంటలు దాటినా రోడ్లు, పొలాలు ఎక్కడా కంటికి కనిపించకుండా పూర్తిగా మంచుతో కమ్ముకున్నాయి. బలిజిపేట పరిసర ప్రాంతం పూర్తిగా మంచుతో కప్పబడి కనిపించింది. విపరీతంగా మంచు కురవడంతో వాహనచోదకులు ద్విచక్రవాహనాలు, ఆటోలు, ఇతరత్రా వాహనాలు లైట్లు వేసుకుని ప్రయాణిం చాల్సిన పరిస్థితి ఎదురై ప్రయాణించేందుకు తీవ్ర అవస్థలు పడ్డారు. మంచు ప్రభావానికి అనారోగ్యం బారిన పడుతున్నామని వాపోయారు.

రెల్లి కులస్తులకు 5 శాతం రిజర్వేషన్ ఇవ్వాలి



కలెక్టరెట్ వద్ద నిరసన తెలుపుతున్న రెల్లి సంక్షేమ సంఘం సభ్యులు

పార్వతీపురంటౌన్: రెల్లి కులస్తులకు 5 శాతం రిజర్వేషన్‌లు ఇవ్వాలని ఆ సంఘం నాయకుడు జి.డేనియల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఆవరణలో రెల్లి సంక్షేమ సంఘం సభ్యుల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెల్లి, ఉపకులాలు ఉన్నాయని, విద్య, ఉద్యోగం, ఉపాధి, రాజకీయ రిజర్వేషన్లకు సంబంధించి 1 శాతం ప్రభుత్వం ప్రకటించడం బాధాకరమన్నారు. రెల్లి కులస్తులను, మాదిగ కులంలో విలీనం చేసి రిజర్వేషన్ ప్రక్రియను చేపట్టాలని, లేదా రెల్లి ఉపకులాలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 5శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. కార్యక్రమంలో పలువురు సంఘం నాయకులు పాల్గొన్నారు.

తప్పుల సవరణకు చివరి అవకాశం

బలిజిపేట: 2024రబీ సీజన్‌లో ఈ పంటలో నమోదైన పంటల వివరాలను రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించి చదివి వినిపించనున్నట్లు ఏఓ శ్రావణ్‌కుమార్ నాయుడు తెలిపారు. అందులో భాగంగా అంపావల్లి సచివాలయంలో జాబితాను సోమవారం ప్రదర్శించి, రైతులకు చదివి వినిపించారు. ఈ క్రాప్ ముసాయిదాను పరిశీలించిన అనంతరం ఈ పంట నమోదులో ఏవైనా చిన్నచిన్న పొరపాట్లు ఉంటే వాటిని వెంటనే తెలియపరచాలని సూచించారు. అభ్యంతరాలు ఉంటే రాత పూర్వకమైన ఫిర్యాదులు అందించాలని అటువంటి వాటికి ఇదే చివరి అవకాశమన్నారు. రైతులందరూ తమ పంటల నమోదు వివరాలను తెలుసుకుని వాటిని సరిచేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.



అంపావల్లి సచివాలయం వద్ద జాబితాను చూపిస్తున్న ఏఓ శ్రావణ్‌కుమార్‌నాయుడు

పది పరీక్షలు ప్రారంభం



బలిజిపేట: పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థుల సందడి



బలిజిపేట: దివ్యాంగుని వాహనంపై పరీక్షకు తీసుకువెళ్తున్న తండ్రి

బలిజిపేట: మండలంలోని మూడు పరీక్షా కేంద్రాలలో పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మూడు కేంద్రాలలో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఎంఈఓ-1సామల సింహాచలం తెలిపారు. బలిజిపేట ఉన్నత పాఠశాలలో రెండు, వంతరాం ఉన్నత పాఠశాలలో ఒక పరీక్షా కేంద్రం నిర్వహించినట్లు తెలిపారు. మొత్తం 456మంది విద్యార్థులు మొదటిరోజు పరీక్షకు శత శాతం హాజరయ్యారన్నారు. బలిజిపేట ఎ-కేంద్రంలో 150మంది, బి-కేంద్రంలో 138మంది, వంతరాంలో 168మంది హాజరైనట్లు చెప్పారు. పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు పహారా ఏర్పాటుచేశామని ఎంఈఓ సింహాచలం చెప్పారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

మక్కువ: మండలంలోని ములక్కాయవలస మోడల్‌పాఠశాల, జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం పదవతరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 404మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకావాల్సి ఉండగా, ఒక్క విద్యార్థి గైర్హాజరయ్యాడు. పరీక్షా కేంద్రాలను చీఫ్ సూపరింటెండెంట్‌లు ఎస్.అంజలి, కె.హేమలత, డిపార్ట్‌మెంటల్ అధికారి జి.రామారావులు పర్యవేక్షించారు. ఎస్సై వెంకటరమణ ఆధ్వర్యంలో పోలీసులు విధులు నిర్వహించారు.

జాతాపు విద్యావలంటీర్లను నియమించాలి

పార్వతీపురం టౌన్: కొఠియా గ్రామాల్లో విద్యాభివృద్ధికి విద్యావలంటీర్లను నియమించాలని ఆ గ్రామస్తుడు జి. సంజయ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఆవరణలో నిరసన తెలియజేసి కలెక్టర్‌కు ఎ.శ్యామ్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొఠియా గ్రామాలైన పగులుచెన్నారు, పట్టు చెన్నేరు, కొదమ, గంజాయభద్ర, పంచాయతీల్లో గల పాఠశాలల్లో తెలుగులో బోధిస్తున్నప్పటికీ గిరిజన విద్యార్థులకు తెలుగు సరిగా అర్థం కాక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఫలితంగా తరగతులు పూర్తవుతున్నా చదువులో వెనుకబడి పాఠశాలలకు వెళ్లకుండా డ్రాపౌట్లుగా మారుతున్నారన్నారు. కువి జాతాపు వలంటీర్లను నియమిస్తే తెలుగు నుంచి గిరిజన భాషలోకి అనువాదం చేస్తారని చెప్పారు. తద్వారా విద్యార్థులకు న్యాయం జరిగి సత్ఫలితాలు వస్తాయని అభిప్రాయ పడ్డారు. అధికారులు ఈ విషయంపై ఆలోచించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వశీం, అజయ్, ప్రకాష్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న కొఠియా గ్రామస్తులు

పారిశుధ్య కార్మికులకు సబ్బులు, నూనె అందజేత



పారిశుధ్య కార్మికులకు సబ్బులు, నూనె అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ తదితరులు

సాలూరు: పట్టణంలోని రెగ్యులర్ పారిశుధ్య కార్మికులకు సోమవారం సబ్బులు, నూనె బాటిల్స్‌ను పంపిణీచేశారు. వాటిని మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, ఇన్‌చార్జ్ కమిషనర్ ప్రసాదరావు తదితరులు అందజేశారు. కార్యక్రమంలో మేనేజర్ శివప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభమైన ఇంటర్ స్పాట్ వాల్యుయేషన్



సమావేశంలో మాట్లాడుతున్న వాల్యుయేటర్

పార్వతీపురంటౌన్: ఇంటర్‌మీడియట్ 2025కు సంబంధించి జనరల్ కోర్సుల పరీక్షలు ఈ నెల 15న పూర్తయ్యాయని మొదటి స్పాట్ వాల్యుయేషన్ సోమవారం ప్రారంభమైందని వాల్యుయేటర్ తెలిపారు. ఈ మేరకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమావేశం ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ స్పాట్ వాల్యుయేషన్ పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్పాట్ వాల్యుయేషన్ క్యాంపు నాలుగు దశలలో నిర్వహించనున్నట్లు చెప్పారు.

అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

పార్వతీపురం రూరల్: సాలూరు మండలం తోణాం పంచాయతీ మద్దెనవలస గ్రామంలో ఎస్టీ జాతాపు కులానికి చెందిన కూనేటి లక్ష్మణ్, భార్య ఝాన్సీ ఇంటికి వెళ్లి అదే గ్రామానికి చెందిన వేరే కులం వారు భౌతిక దాడికి పాల్పడడంతో వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఐక్య ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు ఎస్పీకి సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు నిమ్మక జయరాజ్ మాట్లాడుతూ పోలీసు శాఖ తక్షణమే విచారణ జరిపి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో కె.ఉదయ్‌కుమార్, ఎ.చంద్రశేఖర్, రామకృష్ణ సీతారాం, పుష్పారావు, సీహెచ్ బిందు, ఎం.గిరిధర్, కె.గౌరమ్మ, పి.సురేష్ తదితరులున్నారు.



ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న ఐక్య ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

వారానికి 90గంటల పని ఎవరికోసం?

పార్వతీపురం: వారానికి 90 గంటల పని ఎవరిని ఉద్ధరించడానికి అని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు ప్రశ్నించారు. ఈ మేరకు సోమవారం పట్టణంలోని సుందరయ్య భవనంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌ఎండ్‌టీ చైర్మన్ ఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, ప్రధానమంత్రి నరేంద్రమోడీ లాంటి వారు వారానికి 100గంటలు పని చేస్తున్నారని ఉద్యోగులు, కార్మికులు వారానికి 90గంటలైనా పనిచేయాలని, ఆదివారం సెలవు ఎందుకు? మీ భార్యలను చూస్తూ ఇంట్లో కూర్చోడానికా? అని కార్మికులను, ఉద్యోగులను హేళన చేస్తూ మాట్లాడడం సరికాదన్నారు. ఫ్యాక్టరీ చట్టం 9గంటలకు మించి, వారానికి 48 గంటలు మించి పనిచేయకూడదని చెబుతోందన్నారు. ఇందుకు విరుద్ధంగా బహుళ జాతి కంపెనీలకు వత్తాసు పలుకుతూ కేంద్ర ప్రభుత్వం వారానికి 90 గంటలు పనిచేయాలని చెప్పడం ఎవరిని ఉద్ధరించడానికని దుయ్యబట్టారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఆర్‌వీఎస్ కుమార్, నాయకులు వి.ఇందిర, పి.రంజిత్‌కుమార్, జ్యోతి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

తప్పుల్లేకుండా రీసర్వే రికార్డులు ఉండాలి

- డీఆర్ఓ కె.హేమలత

పార్వతీపుర రూరల్: రీ-సర్వేకు సంబంధించిన రికార్డులను తప్పులకు తావులేకుండా సరిచేయాలని జిల్లా రెవెన్యూ అధికారి కె. హేమలత సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆమె పార్వతీపురం మండలంలోని బందలుప్పి రైతు సేవా కేంద్రంలో రీ-సర్వే జరిగిన రికార్డులను సరిచేసే ప్రక్రియలో ఉన్న వీఆర్‌ఓలు, సర్వేయర్లు బృందంతో మాట్లాడారు. నిర్లక్ష్యం లేకుండా సర్వే జరిగిన భూములకు సంబంధించిన కొలతల్లో ఎటువంటి తేడాలు లేకుండా రీ సర్వే జరిగిన భూములకు రికార్డులను సరిచేయాలని సిబ్బందిని ఆదేశించారు. రైతుల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పరిశీలనలో పార్వతీపురం తహసీల్దార్ వై.జయలక్ష్మి, తదితర సిబ్బంది ఉన్నారు.



బందలుప్పిలో రీ-సర్వే సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత

అంతరపంటల సాగుపై రైతులకు శిక్షణ

మక్కువ: మండలంలోని శిబిల్లిపెద్దవలస గ్రామంలో సోమవారం ఉద్యానవనశాఖ అధికారి ప్రత్యూష అంతరపంటల సాగుపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయిల్‌పామ్ పంటలో, కోకో పంటను అంతరపంటగా సాగుచేసుకుంటే రైతులు మంచి ఆదాయం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రైతులకు శిక్షణ ఇస్తున్న ఉద్యానవనశాఖ అధికారులు



మానవాళి ఆరోగ్యానికి ప్రకృతివ్యవసాయ ఉత్పత్తులు మేలు



కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్

పార్వతీపురంటౌన్: మానవాళి ఆరోగ్యానికి ప్రకృతివ్యవసాయ ఉత్పత్తులు ఎంతో మేలు చేస్తాయని ఎస్ఎఫ్ఏ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ తిరుపతి అన్నారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు కూరగాయలు, ఆకుకూరలు, చిరుధాన్యాలు, పప్పు దినుసులు, పండ్లు, నూనె, బెల్లం ఈ స్టాల్‌లో పెట్టినట్లు చెప్పారు. ఈ స్టాల్ వల్ల ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించిన రైతులకు మార్కెట్ సదుపాయం కలుగుతుందని, రైతులు మంచి ధరకు అమ్ముకోవడానికి ఇది ఒక వేదికలా ఉపయోగపడుతుందన్నారు. ప్రతిసోమవారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మార్కెటింగ్ ఎస్ఎఫ్ఏ భాను, ప్రకృతి వ్యవసాయ రైతులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

జియ్యమ్మవలస: గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ పి.రఘు సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం సందర్శించిన ఆయన.. జనవరి, ఫిబ్రవరి నెలల్లో ఓపీ ఎంత వచ్చింది.. మలేరియా జ్వర నిర్ధారణ పరీక్షలు ఎన్ని జరిగాయన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రిలోని మందుల నిల్వలను పరిశీలించారు. రోగులకు అవసరమైన వైద్యసేవలు సకాలంలో వారికి అందివ్వాలని సిబ్బందిని కోరారు. అక్కడి నుంచి వనజ గ్రామం వెళ్లి, అక్కడ 104 వాహనం ద్వారా అందిస్తున్న వైద్యసేవలను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



వనజలో 104 సిబ్బంది అందిస్తున్న వైద్యసేవలను పరిశీలిస్తున్న జిల్లా ప్రోగ్రాం అధికారి రఘు